కథ

# చెలగాటం-ప్రాణసంకటం

**ద్వివేదుల సోమనాధశాస్త్రి**

దత్తుగారికి కుక్కలంటే ప్రాణం. ఇంట్లో ఒకటో రెండో కుక్కల్ని పెంచుతూ ఉంటాడు ఎప్పుడూ!

అతని ఇంటికి ఎవరు వచ్చినా, అతను ఎవరింటికి వెళ్లినా కుక్క పురాణం చెప్పిన తర్వాతే ఏ మాటల యినా.

వాళ్లింట్లో కూడా కుక్కలుంటే వాటి కుశలప్రశ్నలు అయ్యేక ఇంట్లో వాళ్ల కుశలం అడిగేది!

కుక్కల గురించి పి.హెచ్.డి. ఉందో లేదో గానీ అతను ఆ పని చేస్తే తప్ప కుండా పట్టా వచ్చేదే.

ప్రపంచంలో ఏ దేశంలో ఏ జాతి కుక్కలున్నాయో, వాటి పుట్టు పూర్వోత్త రాలూ, వాటి లక్షణాలూ అన్నీ క్షుణ్ణంగా తెలిసినవాడు. జాతి కుక్కలూ, జూలు కుక్కలు, బొచ్చు కుక్కలు, చుక్కల కుక్కలు, పొట్టికు క్కలు, సంకరజాతి కుక్కలు, ఊరకు క్కలు.. ఇలా అన్ని రకాల శునకరాజాల గురించి ఎన్ని గంటలయినా గుక్క తిప్పుకోకుండా ఉపన్యసించగలడు.

అల్సేషన్, డాబర్‌మాన్, డాల్మేషన్, స్పిజ్, పమే రియన్, బుల్‌డాగ్, జర్మన్ షెపర్డ్ (పోలీసు కుక్క) ల్యాబ్రడార్ మొదలైన కుక్కల లక్షణాలూ గుణాలూ, అలవాట్లూ, రంగులూ వీటి గురించి అతనికి తెలిసినంతగా, ఇంకెవరికీ తెలియవంటే అతిశయోక్తి కాదు. వాటి విశ్వాసం గురించి, గొప్పదనం గురించి అనర్గళంగా చెబుతాడు.

యజమాని మంచం పడితే అతని దగ్గరే ఉండి చూసుకోవడం, టెలిఫోన్ అందించడం, పక్కింటి వాళ్లని చొక్కా పట్టుకు వచ్చేంత వరకూ వదల కుండా రావడం కుక్కలు చేస్తాయట.

యజమాని ఎక్కడికయినా వెళితే అతని వెంటే వెళ్లడం.. లేకపోతే అతను వచ్చేవరకూ గుమ్మం ముందు కూర్చుని ఎదురుచూస్తాయట.

ఏ దేశంలోనో సముద్రపుటొడ్డున పెంచు తున్న కుక్కని వదిలి యజమాని దేశాంతరం వెళ్లి పోతే వాళ్ల కోసం ఎదురుచూస్తూ అక్కడే ఉండిపో వడం, యజమాని చనిపోతే తనూ నిద్రాహారాలు మాని ప్రాణత్యాగం చేయడం ఇలాంటివన్నీ ఒక్క కుక్కలకే సాధ్యం అని అంటాడు. ఇలాంటి కథలు వినేవాళ్లు ఉండాలి గానీ ఎన్నయినా చెబు తాడు.

వాటికి తమాషా.. తమాషా అయిన పేర్లు పెట్టి పిలుస్తాడు. సోనీ, పోనీ, టైగర్, పింకీ, బ్యూటీ, బ్లాకీ, డిస్నీ... ఇలా.

కానీ దత్తుగారు మాత్రం అవి ఇంట్లో ఏం చేసినా ఏమీ అనరు. అవీ మన పిల్లల్లాటివే అని అంటారు. కుక్కలకి వంటింట్లోనే భోజనం పెట్టి స్తారు. అతని బాత్‌రూంలోనే అభ్యంగనస్నానం చేయిస్తారు. వాటికని వేరే కంచం, గిన్నెలేవు. ఏ కంచమయినా, ఏ గిన్నయినా ఫరవాలేదు. వాటిని మళ్లీ ఇంట్లో కూడా వాడేస్తారు.

వాటికి కుక్క బిస్కట్లు, బలానికి టానిక్కులు, పళ్లు గట్టిపడడానికి ప్లాస్టిక్ ఎముకలు, ఆడుకో డానికి బంతులూ, ఓహ్ శునక భోగం! చెప్పన లవి కాదు. ఇంకా చెప్పవలసి వస్తే వాటికి రాచ మర్యాద కూడా జరిపిస్తారు. వారానికి రెండు రోజులు స్పెషల్ మాంసాహారం తినిపిస్తారు.

దత్తుగారి శునకప్రేమ మంచిదే గానీ వాటిని ఎక్కడ ఉంచాలో అక్కడ ఉంచకుండా ఎలా పెంచాలో అలా పెంచకుండా నెత్తికెక్కించుకోవ డమే అతని బలహీనత. అందుచేతే అవి ముద్దులా డితే మూతి నాకుతాయి- మచ్చిక చేస్తే మీదకెక్కు తాయి.

తన మాట ఎవరూ వినకపోతే, తనని ఎవరూ ఖాతరే చేయకపోతే కుక్కను పెంచుకుంటే సరి అంటారు. ఎందుకంటే అది మాత్రం అతని వెంటే తిరుగుతూ చెప్పినట్టు వింటూ తోకాడి స్తాయి. అందుకేనేమో కొందరు కుక్కల్ని పెంచు కుంటారు. వాటిని 'హిజ్‌మాస్టర్స్ వాయిస్' అని ఊరకే అన్నారా?

వాటి మీద అతిప్రేమకొద్దీ విచ్చలవిడిగా ఇంట్లో వదిలేస్తారు. సోఫాల మీద- కుర్చీల మీద- ఆఖరికి పక్కల మీద కూడా పడుకోబెట్టుకుం టారు.

వాటి అవసరాలకి టైము ప్రకారం బయటకు తీసుకెళ్లటానికి బద్ధకిస్తే అవి కాలకృత్యాలు ఇంట్లో ఎక్కడ పడితే అక్కడ తీర్చుకుంటాయి. వాటిని అదుపులో ఉంచితే అవి ససేమిరా అలా చేయవు. వాటికా అవసరం రాగానే - అరిచో గోకో తీసుకువెళ్లమంటాయి.

ఇంటికొచ్చిన వాళ్లు తెలియక అసహ్యించు కున్నా మీద మీదకొస్తే కసురుకున్నా దూరంగా జరిగినా, అది తన కుక్క పట్ల అమర్యాదగా భావించి, వచ్చిన వాళ్లకి పాఠం చెబుతారు. అవీ మనతో సమానమేనని, వాటిని గౌరవించాలి గానీ అలా అవమానించకూడదంటాడు. వాటి కున్న విశ్వాసం మనుషులకు లేదంటాడు.

కుక్కలతో కొలువయిన దత్తాత్రేయ పటాన్ని దేవుని మందిరంలో ఉంటుంది. తన కుక్క కూడా దేవుడి గదిలో యధేచ్ఛగా తిరుగుతుంది. అప్పుడ ప్పుడు అక్కడ పెట్టిన నైవేద్యాలను ఆరగించినా ఏమీ అనడు. అంతెందుకు దత్తుగారు శునకాభి మాని, శునకారాధకుడు, శునక ప్రేమికుడు, శునక భక్తుడు, శునక కథకుడు. కుక్కలని ఎవరు విమర్శించినా, విరుద్ధంగా మాట్లాడినా సహిం చడు. అలా అన్న వారిని కూడా అన్ని మాటలూ అనందే ఊరుకోడు.

ఇంటికొచ్చిన వాళ్లు ఎవరయినా సరే తన పిల్లల్ని పలకరించకపోయినా, ముద్దులాడకపో యినా ఏమీ అనుకోడు గానీ కుక్కని మాత్రం ముద్దు చేయకపోతే బాధపడతాడు.

అది భౌభౌ అంటూ మీద మీదకొస్తున్నా- కరుస్తుందేమోనని భయపడి ఛస్తున్నా, దాన్నేమీ అననీయడు. "భయం లేదు, ఏమీ చేయదు!" అని నవ్వుతూ ఊరుకుంటాడు. వాళ్లు ఉన్నంతసేపూ

ఆ కుక్క ఎదురుగా కాపలా కాస్తున్నట్టు కూర్చుంటుంది.

మరో మాట లేకుండా వచ్చిన వాళ్లున్నంత సేపూ ఆ కుక్క గొప్పతనం, దాని చేష్టల గురించి, దాని గుణగణాలను వర్ణించి చెబుతాడు. అంతే గాక తన కుక్క ఇలాంటిది, అలాంటిదీ కాదని దాని బ్రీడ్ చాలా గొప్పదని తన అదృష్టం కొద్దీ దొరికింది అని చెబుతాడు.

ఇంక భరించలేక ఆ వచ్చిన వాళ్లు వెళ్లిపోవలసిందే.

ఒకరోజు దత్తుగారి స్నేహితుడు రావు చూసి పోదామని వచ్చాడు. రావుగారికి కుక్కలంటే అయిష్టత లేదు గానీ వాటిని నెత్తికెక్కించుకుంటే మాత్రం ఇష్టం ఉండదు.

గుమ్మంలో అడుగుపెట్టగానే దత్తుగారి ముద్దు కుక్క రావుగారి చుట్టూ తిరుగుతూ బట్టల్నీ, జోడునీ, కాళ్లనీ వాసన చూస్తూ నాకడం మొదలెట్టింది. కాళ్లు ఎత్తి చేతులతో బక్కరడం మొదలెట్టింది. ఎగబాకుతూ నానా అల్లరీ చేస్తూంది.


రావుగారికి వళ్లంతా తేళ్లూ జెర్రులు ప్రాకుతున్నట్టయింది. ఎంత అసహ్యించుకున్నా స్నేహితుని దగ్గర మొహమాటం వల్ల ఏమనకుండా సహించి ఊరుకున్నాడు. దత్తుగారు కుక్కనేమీ అనకుండా ప్రేమగా "కమాన్! కమాన్!" అని దగ్గరకు పిలిచి ఎత్తుకుని ముద్దుచేశాడు. అదేం తక్కువదా? తోకాడిస్తూ 'కుయ్ కుయ్'మంటూ దత్తుగారి మొహం నాకింది. అక్కడితో రావుగారు బ్రతుకు జీవుడా అని ఊపిరి పీల్చుకున్నాడు.

దత్తుగారు కుక్కని కిందకు దింపగానే మళ్లీ దాని అల్లరి మొదలెట్టింది. రావుగారి కాళ్ల మధ్య పడుతూ బక్కరడం, బట్టల్ని నోటితో పట్టుకు లాగడం, కుర్చీ మీద కాళ్లు వేసి చేతులు నాకడం మొదలెట్టింది. రావుగారు భరించలేక వదుల్చుకోబోతే-

"ఫరవాలేదు.. ఫరవాలేదు. అది అలా ఆడుకుంటుంది. అంతేగానీ ఏమీ చేయదు" అని అంటూ దత్తుగారు నవ్వుతాడేగానీ ఆ కుక్కని అదమాయించడం గానీ పట్టుకుని దూరంగా ఉంచడం గానీ చేయలేదు. చెలగాటం ఆడుతూ ఆడుతూ రావుగారి కాళ్లమీదకు ఒక్కసారి లంఘించింది. భయంతో రావుగారు కాళ్లు వెనక్కి తీసుకుంటూ కుక్కని పక్కకు తోసేశాడు.

ఆ కుక్క ఏమనుకుందో ఏమోగానీ రావుగారి కాలు పట్టుకు కరిచింది. పళ్లు బాగానే నాటేయి. రక్తం కూడా వచ్చింది. రావుగారు అనుకున్నంత అయింది.

అతను భయపడినట్టే అయింది. లేకపోతే "కుక్క ఏమెరుంగు? పిక్కబట్టి యొడసి పీకుగాక" అని ఊరికే అన్నాడా వేమన.



ఇంక ఇంజక్షన్లూ, మందులూ, ఏమవుతుందో ఏమో! భయం పట్టుకుంది. పదిహేను రోజులు ఆ కుక్కని కనిపె

టండి అంటారు. ఈలోగా ఆ కుక్కకేమయినా అయిందా దానికి పిచ్చి పట్టిందా నా పని అయినట్టే పది ఇరవయి రోజుల్లో ఏమీ అనకపోయినా తర్వాత కూడా చెప్పలేం! ఆ సుబ్బారావుకేమయింది? చిన్న కుక్కపిల్ల కరిస్తే పదేళ్ల తర్వాత నీళ్లంటే భయంతో కుక్కలా అరుస్తూ ప్రాణం వదిలాడు. అమ్మో అంత ఘోరమైన చావు తలుచుకుంటేనే వణుకు పట్టుకుంది. ఏమిటి సాధనం?" అనుకున్నాడు.

బొడ్డు చుట్టూ పధ్నాలుగు పెద్ద పెద్ద ఇంజక్షన్లు తీసుకోవలసిందేనా? ఇలా రావుగారు తలుచుకునేసరికి ముచ్చెమటలు పోసేసాయి. మాటలు రాక అవాక్కయిపోయాడు.

అతనిని చూసి దత్తు "ఫరవాలేదు లేరా! భయపడకు. మా కుక్క కరిస్తే ఏమీ అవదు. నేను రోజూ ఇదెలా ఉందో చెబుతూంటానులే! ఒక్క పదిహేను రోజులు. దీనికేం కాకుండా నేను చూసుకుంటానులే- నీవు నిశ్చింతగా ఉండు! నీకేం భయంలేదు!" అని చిన్న నవ్వు నవ్వుతూ అన్నాడు.

"ఛీ తప్పుకదూ! వచ్చిన వాళ్లని అలా కరవడమేనా! బుద్ధిలేదూ!" అని కుక్కని బుజ్జగిస్తూ అన్నాడు అంతే.

వాడి ఒళ్లో వెధవ కుక్క ముద్దులు గురుస్తూ తోకాడిస్తూ కూర్చుని రావు వేపు కోపంతో చూస్తూ "భౌభౌ" అని అరుస్తూంది. నాలిక వెళ్లబెట్టి ఒగురుస్తూ-

ఇంక ఆ పీడ వదుల్చుకుందామని లేచాడు రావుగారు.

"ఇంక వెళతానురా! చాలాసేపయింది వచ్చి" అని అన్నాడు.

"ఏమనుకోకురో! మా 'బిన్నీ' ఇలాంటి పని చేస్తుందనుకోలేదు. అయామ్ సారీ! అయినా నీకేం కాదులే!" అని భరోసా ఇచ్చేడు. అయినా రావు అదుర్దా, భయం చేత గబగబా డాక్టరుగారి దగ్గరకు పరుగెట్టాడు.

డాక్టరుగారు చూసి "బాగానే గాట్లు పడ్డాయ్!" అంటూ వెంటనే 'టెటనస్' ఇంజక్షన్ ఇచ్చి- "మరేం గాభరా పడకండి! పది పదిహేను రోజులు ఆ కుక్కని కనిపెట్టి ఉండండి. పెంపుడు కుక్కే అంటున్నారు కాబట్టి దానికి ఏంటీరేబిస్ ఇంజక్షను ఇచ్చే ఉంటారు. ఏది ఏమయినా పదిహేను రోజులు చూసి నాకు వచ్చి చెప్పండి" అని అన్నాడు.

డాక్టరుగారికి నూరు రూపాయలు సమర్పించుకొని వచ్చాడు రావు.

ఏమనుకున్నా ఏం లాభం జరగకూడనిదేదో జరిగిపోయింది.

ఇంక నాకేమీ ప్రాణం మీదకు రాకూడదని కుక్క ఛావు చావకుండా కాపాడమని ఆ భగవంతుణ్ని ప్రార్థించడం తప్పితే అన్యథా శరణం నాస్తి అనుకున్నాడు.

"నాకేమీ కాకుండా ఉండాలంటే ఆ కుక్క క్షేమంగా ఉండాలని ప్రార్థించాలా? నేను క్షేమంగా ఉండాలని కోరుకోవాలా?" అని ఆలోచించాడు రావు తర్జన భర్జన పడుతూ.

వెనకటికి ఒక ప్రబుద్ధుడు తపస్సు చేశాడట. భగవంతుడు ప్రత్యక్షమయి వరం కోరుకోమంటే- నా మేనమామ చెవిలో వెంట్రుకలు బాగా మొలవాలని కోరుకున్నాడట. ఎందుకంటే మేనమామ చెవుల్లో ఎంత దట్టంగా వెంట్రుకలుంటే అంత గొప్ప అదృష్టం మేనల్లుడికి కలుగుతుందని ఎవరో చెప్పారట? అలా ఉంది రావు పరిస్థితి. ఆ కుక్క బాగుంటే రావు కూడా బాగున్నట్టే కదా.

అందువల్ల ఆ కుక్కే క్షేమంగా ఉండాలని ప్రార్థిస్తేనే మంచిది. ఎందుకంటే -దత్తుగారు కూడా బహుశా -'నా కుక్కకేమీ అవకూడదు భగవంతుడా! దానిని కాపాడు! అది లేకపోతే మేం బ్రతుకలేం! అని ప్రార్థిస్తూ ఉంటాడు. నేనెనిలా పోతేనేం?' అని అనుకున్నాడు రావు ఆఖరికి. కుక్కకు చెలగాటం-రావుగారికి ప్రాణసంకటం అయింది.

అవునండీ! అందుకనే రావుగారు కూడా ఆ కుక్క పది కాలాల పాటు క్షేమంగా బ్రతికి ఉండాలని వేయి దేవుళ్లకు మొక్కుకున్నాడు.

'కనకపు సింహాసనమున శునకము కూర్చుండబెట్ట వెనుకటి గుణమేలమాను?' అని ఊరికినే అన్నాడా సుమతీ శతకకారుడు!

ఏదయితేనేం ఆ ఇద్దరూ కూడా ఆ కుక్కే క్షేమంగా ఉండాలని ఆ భగవంతుణ్ని ప్రార్థించడం మొదలెట్టేరు. ○

## దటీజ్ దీపిక

దీపికా పదుకొనే ఇప్పుడు బాలీవుడ్‌లో అమాంతం స్టారైపోయింది. 'ఓం శాంతి ఓం' సినిమా సూపర్ హిట్ కావడంతో అవకాశాలు వెల్లువలా వచ్చిపడుతున్నాయి ఆమె ఇంటి ముందు. తన సక్సెస్ నేపథ్యంలో దీపిక వ్యాఖ్యానిస్తూ- 'నేను నా 18వ ఏట సొంతంగా కారు కొనుక్కోవాలనుకున్నాను. ఏడాది తిరక్కుండానే నాకు నచ్చిన కారు కొనుక్కున్నాను. అలాగే సొంతిల్లు కూడా. ఇప్పుడు నా వయసు 21 ఏళ్లు. నా తొలి సొంత ఇంటిని కొనుక్కోగలిగాను' అంటూ గర్వంగా చెబుతోంది. గ్రేటే

